
టేక్మాల్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వారికి ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయం

- సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడంపై నిరసనలు
- తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేసిన బీఆర్ఎస్ నాయకులు

తూప్రాన్: కూచారంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల క్షీరాభిషేకం

తూప్రాన్, సెప్టెంబర్ 17: తెలంగాణ తల్లి విలువ తెలియని వారికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. తూప్రాన్‌లోని నర్సాపూర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న ప్రదేశంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సతీశ్‌చారి, మన్నె శ్రీనివాస్, బురాన్, యాసిన్, మామిండ్ల అనిల్ పాల్గొన్నారు.

తూప్రాన్: తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

టేక్మాల్‌లో..

అల్లాదుర్గం, సెప్టెంబర్ 17: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు టేక్మాల్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆఆర్ నేతలు మాట్లాడుతూ సచివాలయం, తెలంగాణ అమరజ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడంపై మండిపడ్డారు. చేసిన తప్పుని రేవంత్‌రెడ్డి సరిదిద్దుకోవాలని, లేదంటే తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, సిద్ధయ్య, చింత రవి పాల్గొన్నారు.

నమ్మించి 3 తులాల గొలుసు చోరీ

నిజాంపేట, సెప్టెంబర్17: నగలు జాగ్రత్తగా పెట్టుకోవాలని నమ్మించి దంపతుల నుంచి పట్టపగలే 3 తులాల బంగారు గొలుసును చోరీ చేసిన ఘటన మండలంలోని నందిగామ శివారులో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన దంపతులు బలిజ లక్ష్మీ మల్లేశం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు వైద్యం కోసం వెళ్తున్నారు. నందిగామ గ్రామ శివారు రాయిలాపూర్ గేట్ వద్దకు రాగానే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అడ్డం వచ్చి అమ్మా.. దొంగలు ఉంటారు జాగ్రత్త.. బంగారు నగలు మెడలో ఉంటే ఎత్తుకెళ్తారని లక్ష్మిని నమ్మించారు. ఆమె 3 తులాల బంగారు గొలుసును తెల్లటి కాగితంలో చుట్టి ఇస్తానని మాయమాటలు చెప్పారు. ఇదే అదనుగా భావించిన దుండగులు తెల్లటి కాగితంలో బంగారు గొలుసుకు బదులు సమాన బరువు గల రాళ్లను పెట్టి లక్ష్మికి ఇచ్చారు. బాధితురాలు రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు వెళ్లి చూసుకోగా, కాగితంలో రాళ్లను చూసి కన్నీటిపర్యంతమైంది. బాధిత దంపతులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట సీఐ వెంకటరాజుగౌడ్, నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బోరున విలపిస్తున్న బాధితురాలు లక్ష్మి

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

రామాయంపేట, సెప్టెంబర్ 17: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అక్కన్నపేట శివారు రైలు పట్టాల వద్ద మంగళవారం జరిగింది. కామారెడ్డి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్పర్తి గ్రామానికి చెందిన వెంకటాపురం శివ రాములు(35) కొంత కాలంగా అప్పుల బాధతో మనసిక ఒత్తిడికి గురవుతున్నాడు. దీంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడు గొల్పర్తి విషయం తెలిసిన కామారెడ్డి పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి పోలీసులు తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నాడు.

శివరాములు(ఫైల్)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మెదక్‌రూరల్, సెప్టెంబర్ 17: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ మండలంలోని కొంటూరు చెరువులో మంగళవారం జరిగింది. రూరల్ ఎస్సై మురళి కథనం మేరకు.. మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన మంగళి నర్సింలు(40) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కొంటూరు చెరువు సమీపంలో మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మృతుడు నర్సింలుగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మురళి

ఘనంగా ప్రధాని మోదీ పుట్టిన రోజు

నర్సాపూర్, అల్లాదుర్గం, చేగుంటలో ప్రధాని మోదీ పుట్టిన రోజు వేడుకలు

నర్సాపూర్/అల్లాదుర్గం/ చేగుంట, సెప్టెంబర్ 17: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం అల్లాదుర్గంలోని బీజేపీ కార్యాయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో జీజేపీ నాయకులు బ్రహ్మం, రాములు, మండల అధ్యక్షుడు యాదగిరి, రాజు, బేతయ్య పాల్గొన్నారు. నార్సింగిలోని ప్రభుత్వ దవాఖానలో బీజేపీ నాయకులు సత్యపాల్‌రెడ్డి, లక్ష్మణ్, ఎన్నం లింగారెడ్డి, కుమ్మరి నర్సింహులు, నరేశ్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేశ్‌యాదవ్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయనతో నాయకులు రమేశ్‌గౌడ్, రాజేందర్, యాదగిరి, బాలరాజు, నీలి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, రమేశ్‌గౌడ్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

వెల్దుర్తి, సెప్టెంబర్ 17: వెల్దుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలు అందజేసినట్లు హెచ్ఎం సాంబయ్య తెలిపారు. మంగళవారం పాఠశాలలోని 412 మంది కి వైద్యులు సంగీత, వెంకటేశ్ పరీక్షలు చేశారు. 19 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు.

మెదక్ మున్సిపలిటీ: గణనాథుడికి హారతి ఇస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో ఊర చెరువులో వినాయకుడిని నిమజ్జనంకు తీసుకెళ్లిన భక్తులు

చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో పూజలు చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

శివ్వంపేట: చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద గణేశుడిని నిమజ్జనానికి తరలిస్తున్న సిబ్బంది

గంగమ్మ ఒడికి బొజ్జ గణపయ్య

- గణనాథులకు మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక పూజలు
- భక్తి శ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనాలు
- వినాయకుడికి 101 రకాల నైవేద్యాల సమర్పణ

మెదక్ మున్సిపాలిటీ/మెదక్ రూరల్/చేగుంట/రామాయంపేట/ పెద్దశంకరంపేట/ చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 17: జిల్లా కేంద్రంలోని పలు వినాయకులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, మాజీ ఏఎమ్‌సీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ఆర్‌కె శ్రీనివాస్, జయరాజ్, మాజీ కౌన్సిలర్ రబ్బీ, నాయకులు కృష్ణాగౌడ్, లింగారెడ్డి, ప్రభురెడ్డి, మల్లేశం, కిరణ్, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, భరత్ ఉన్నారు. చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి వినాయక మండపంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పూజలు చేశారు. చేగుంట, కర్నాల్‌పల్లి తదితర గ్రామాల్లో వినాయకుడిని భక్తి శ్రద్ధలతో పూజించారు. మహిళలు, చిన్నారుల కోలాటలతో ఊరేగించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. రామాయంపేట, కోనాపూర్, రాయిలాపూర్, డి.ధర్మారం, అక్కన్నపేట తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. పెద్దశంకరంపేటలోని మాధవనగర్ కాలనీలోని మండపం వద్ద వినాయకుడికి 101 రకాల స్వీట్లు, వంటకాలతో నైవేద్యాలు సమర్పించారు.


మెదక్ మున్సిపాలిటీ: గణనాథుడికి పూజ చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


పెద్దశంకరంపేట: మాధవనగర్ కాలనీలో 101 రకాల నైవేద్యాలను ఉంచిన మహిళలు

రామాయంపేట: వివేకానంద విద్యాలయంలో విద్యార్థులకు అన్న ప్రసాద వితరణ

మెదక్ రూరల్: వినాయకుడికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు

రామాయంపేట: సర్వాయికుంటలో వినాయక నిమజ్జనం చేస్తున్న యువత

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి హరీశ్‌రావు పరామర్శ


సోములు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, సెప్టెంబర్ 17: బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తాడేపు సోములు కుటుంబాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎల్లాపూర్‌లో మంగళవారం పరామర్శించారు. సోములు సోదరుడు సుధాకర్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఈ మేరకు వారి స్వగృహానికి వచ్చిన హరీశ్‌రావు మృతుడి భార్య యాదమ్మ, కొడుకులు, కూతురుతో మాట్లాడారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట మాజీ ఇఫ్కో డైరక్టర్ దేవేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ జగపతి , మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు జగన్, మన్సిపాల్ వైస్‌చైర్మన్ మల్లి ఖార్జున్‌గౌడ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు గురుమూర్తి గౌడ్,బాపరావ్, లింగరెడ్డి, కిష్టయ్య,జగన్ తదితరులు ఉన్నారు.

ఏడుపాయల్లో పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

ఏడుపాయల దుర్గమ్మకు పల్లకీ సేవ

పాపన్నపేట,సెప్టెంబర్ 17: తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గమ్మకు మంగళవారం పౌర్ణమి పురస్కరించుకొని పల్లకీ సేవ నిర్వహించారు. అర్చకులు శంకర శర్మ పార్థివ శర్మలు మూల విరాట్ మాతను అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ముస్తాబు చేసి, పల్లకీపై కూర్చోబెట్టారు. బ్రహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా దుర్గామాతకు జై అంటూ భక్తులు పల్లకీ సేవ ప్రారంభించారు. గర్భ గుడి నుంచి రాజ గోపురం వరకు సేవ కొనసాగించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి వృద్ధురాలు మృతి

పోచవ్వ(ఫైల్)

చేగుంట, సెప్టెంబర్ 17: దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దశివునూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశివునూర్‌కు చెందిన తలారి పోచవ్వ (83) ఈ నెల 15న గ్రామ సమీపంలోని మొగుళ్ల చెరువులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి, చెరువులో పడిపోయింది. ఇది గమనించిన స్థానికులు ఆమెను రక్షించి తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ మంగళవారం మృతి చెందింది. మృతురాలి మనమడు తలారి మహేశ్ ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

విజేతలుగా నిలిచిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ బల్‌రామ్‌నాయక్

నర్సాపూర్, సెప్టెంబర్ 17: నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బల్‌రామ్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర 5వ బేస్‌బాల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ జూనియర్ చాంపియన్‌షిప్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. నిర్మల్ జిల్లాలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన పోటీల్లో పాల్గొని, ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు.

ప్రధాని ఆవాస్ యోజన - అర్బన్ 2.0కి శ్రీకారం

మెదక్,సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన –అర్బన్ 2.0 కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఈఈ నర్సింహులు, మోప్మా పీడీ ఇందిరా, ఈడీఎం సందీప్ సంబంధిత లబ్ధిదారులు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రధాని మాట్లాడుతూ ఐదేండ్లలో రూ.10 లక్షల కోట్లతో కోటి పట్టణ గృహాలు నిర్మించేందుకు ప్రణాళిక రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశం ముందంజలో ఉన్నదన్నారు. పట్టణ పేదలు, మధ్య తరగతి ప్రజలకు బాసటగా నిలుస్తుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 17: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అతిథి అధ్యాపక పోస్టు 1, రామాయంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితం, భౌతికం శాస్త్రంలో ఒక్కో పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెదక్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అంతు నర్సయ్య

చేగుంట, సెప్టెంబర్ 17: పశువులకాడికి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మక్కరాజిపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంతు నర్సయ్య(60) ఈనెల 14న పశువుల కాడికి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు గ్రామస్తులను, చుట్టు పక్కలవారిని, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం నర్సయ్య కుమారుడు అంతు సిద్దిరాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఆరోగ్యమిత్ర నిరవధిక సమ్మె

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 17: నేటి నుంచి రాజీవ్ ఆరోగ్యశ్రీ మిత్రలు నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఆరోగ్య మిత్ర, ఆరోగ్యశ్రీ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అంతోల్ల సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సమ్మెకు వెళ్లాలని రాష్ట్ర సంఘం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. బుధవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయాలన్ని ముట్టడించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

- హస్త కళాకారులు, వాస్తు శిల్పులందరికీ అభిపతి విశ్వకర్మ
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్ రాజ్

ఘనంగా విశ్వకర్మ జయంతి

మెదక్ కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట: పట్టణంలో మనుమయ, విశ్వకర్మ సంఘాల అధ్వర్యంలో ర్యాలీ

నర్సాపూర్: పెద్దచింతకుంటలో పూజలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు మల్లేశ్‌గౌడ్, సంఘాల నాయకులు

మెదక్,(నమస్తే తెలంగాణ)/నర్సాపూర్/పెద్దశంకరంపేట/పాపన్నపేట/ రామాయంపేట/నిజాంపేట/అల్లాదుర్గం, సెప్టెంబర్ 17: దైనిక వాస్తుశిల్పి విశ్వకర్మ పుట్టినరోజును పండుగలా నిర్వహించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతిలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్‌కుమార్, అడిషనల్ ఎస్పీ మహేందర్, బీజీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశ్వకర్మ జయంతిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా సెప్టెంబర్ 17న విశ్వకర్మ పూజ చేస్తారన్నారు. హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ స్వయంభుగా, ప్రపంచ సృష్టికర్తగా పరిగణించబడ్డాడని, కృష్ణుడు పాలించిన ద్వారక నగరాన్ని పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజభవనాన్ని, దేవతల కోసం అనేక అద్భుతమైన ఆయుధాలు తయారు చేశాడన్నాడు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లడుతూ హిందూ సంప్రదాయం ప్రకారం విశ్వకర్మను ప్రపంచంలోని డివైన్ ఇంజినీర్ అని పిలుస్తారన్నారు.

నిజాంపేటలో విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న విశ్వకర్మలు

పెద్దశంకరంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు, సభ్యులు

పాపన్నపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో హోమంనిర్వహిస్తున్న విశ్వకర్మలు

అల్లాదుర్గంలో విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.